www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 జులై 2025

5

పశ్చిమ గోదావరి

ఆర్‌టిసి ఆస్తులు ప్రయివేటుపరం తగదు

రెడ్ బ్యాడ్జీలతో డిపో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్‌టిసి ఆస్తులను ప్రయివేట్ సంస్థలకు అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు డిపో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయుఎ)యూనియన్ అధ్యక్షులు ఎంఎస్.బాబు ఆధ్వర్యాన శనివారం ఆర్‌టిసి డిపోలో ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డిపో జాయింట్ సెక్రెటరీ కొండలరావు, డిపో పబ్లిసిటీ సెక్రెటరీ జి.నిరంజన్, సభ్యులు పాల్గొన్నారు.

రెడ్ బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

దారి తప్పిన పి-4..!

ఉద్యోగులనే మార్గదర్శకులుగా నమోదు

సచివాలయ ఉద్యోగులకు 3 నుంచి 5 కుటుంబాలు దత్తత

ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. ఆచరణకు పొంతన కరువు

మార్గదర్శకులు ముందుకు రాక ఉద్యోగుల పేర్లు నమోదు

ఏలూరు జిల్లాలో 77,485, పశ్చిమలో 64,940 బంగారు కుటుంబాల గుర్తింపు

రూ.30 వేలలోపు జీతం ఉన్న సచివాలయ ఉద్యోగికి కుటుంబాల దత్తత సాధ్యమేనా?

ఉపాధ్యాయులపైనా ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం గొప్పగా చెబుతున్న పి-4 కార్యక్రమం దారి తప్పింది. పి-4పై ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. ఆచరణకు పొంతన లేకుండాపోయింది. సమాజంలోని సంపన్నులు పేదలైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా, విద్యాపరంగానే కాకుండా ఇతర అంశాల్లో అండగా ఉంటూ పైకి తీసుకొచ్చేలా పి-4 కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా నామకరణం చేసి, దత్తత తీసుకునేవారిని మార్గదర్శకులుగా ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమంపై అనేక విమర్శలు వచ్చినప్పటికీ కొన్ని కుటుంబాలకైనా లబ్ధి చేకూరుతుందని చాలామంది అనుకున్నారు. ప్రభుత్వ ఆర్భాట ప్రచారానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. ఆగస్టు 15వ తేదీకల్లా జిల్లాలవారీగా గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చేయాలని ప్రభుత్వం టార్గెట్ విధించింది. పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముం దుకు రాకపోవడంతో ఉద్యోగులనే మార్గ దర్శకులుగా న మోదు చేస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో మొత్తం 74,485 బంగారు కు టుంబాలను సర్వే ద్వారా గుర్తించారు. కొద్దిరోజుల క్రితం అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం 5,270 కుటుంబాలను 154 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంకా 70 వేలకుపైగా ఉన్న బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను అధికారులు గుర్తించాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 64,940 బంగారు కుటుంబాలను గుర్తించారు. 16,833 కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకున్నట్లు ఇటీవల ఇచ్చిన లెక్కల్లో తెలిపారు. ఇంకా దాదాపు 48 వేల బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను ఏర్పాటు చేయాల్సి ఉంది. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రాకపోవడంతో సచివాలయ ఉద్యోగులే మూడు నుంచి ఐదు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సాగుతోంది. సచివాలయ ఉద్యోగుల జీతం రూ.30 వేలలోపే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ జీతంతో కుటుంబం గడవడమే కష్టం. అలాంటి చిరుద్యోగులు పేదలైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ఏవిధంగా న్యాయం చేయగలరో ప్రభుత్వమే చెప్పాలి. ఉపాధ్యాయులను సైతం బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయుల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న ప్రకారం బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులు ఆ కుటుంబం ఉండటానికి ఇల్లు, బతకడానికి ఉపాధి, కుటుంబంలోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం, ఆరోగ్యపరంగా ఇబ్బందులుంటే ఆదుకోవడం వంటి అనేక లక్ష్యాలను నిర్దేశించారు. సచివాలయ ఉద్యోగులకు బంగారు కుటుంబాలను దత్తత ఇస్తే ఈ లక్ష్యం ఏవిధంగా నెరవేరుతుందో ప్రభుత్వమే చెప్పాలి.

టార్గెట్ల కోసం ఉద్యోగుల పేర్లు నమోదు

ప్రభుత్వం పి-4 కార్యక్రమాన్ని గొప్పగా వర్ణిస్తోంది. అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకునేలా ముందుకు సాగుతున్నట్లు చెబుతోంది. ఆగస్టు 15 నాటికి జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం పూర్తికావాలని జిల్లా అధికారులకు టార్గెట్లు పెట్టింది. దీంతో అధికారులు పి-4 కార్యక్రమ లక్ష్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేసి టార్గెట్లు పూర్తి చేసేందుకు సచివాలయ ఉద్యోగులను మార్గదర్శకులుగా నమోదు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులంతా దత్తత తీసుకోవాలని ఎంపిడిఒలు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం చెబుతున్న పి-4 కార్యక్రమం దారి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆడుదాం ఆంధ్రా, యోగాంధ్ర కార్యక్రమాల్లా పి-4

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆడుదాం ఆంధ్రా, కూటమి ప్రభుత్వం వచ్చాక యోగాంధ్ర కార్యక్రమంలా పి-4 కార్యక్రమం తయారైందనే చర్చ సాగుతోంది. అప్పట్లో ఆటగాళ్ల నమోదుపై టార్గెట్లు విధించి సచివాలయ ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆటలు ఆడేవారు.. ఆడలేని వాళ్లను సైతం నమోదు చేశారు. ఇటీవల యోగాంధ్ర పేర్ల నమోదులోనూ ఇదే ఒరవడి కొన సాగింది. ఇవన్నీ లెక్కల కోసమే తప్ప జనానికి ఉప యోగపడిందేమీ లేకుండాపోయింది. పి-4 కార్యక్రమాన్ని ఆదేవి ధంగా లెక్కల కోసమే అన్నట్లు మార్చేశారా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

తాగునీటి సమస్య పరిష్కరించండి

తొలిఅడుగులో మంత్రి అచ్చెన్నకు వెలమపేట వాసుల వినతి

సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - గణపవరం

'మాకు తాగడానికి నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటి సమస్య పరిష్కరించండి, అలాగే డ్రెయినేజీ సమస్య కూడా వేధిస్తోంది' అంటూ గణపవరం వెలమపేట వాసులు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు శనివారం వెలమపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు సమస్యలు చెప్పగానే ఈ సమస్య ఎప్పటికి పరిష్కరిస్తారని గ్రామ సర్పంచి ఎంఎ భాస్కర్‌రావును మంత్రి ప్రశ్నించారు. జలజీవన పనులు పూర్తి కాక సమస్య ఉందని సర్పంచి తెలపగా, పనులు వెంటనే పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక కెవిపి ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశానికి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు. ఉచిత గ్యాస్ సిలెండర్‌ఖు సంబంధించి ఇక నుంచి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గణపవరం సొసైటీ అధ్యక్షునిగా కూసంపూడి సురేంద్రకుమార్‌రాజుచే ప్రమాణ స్వీకారం చేయించారు.

గణపవరంలో మంత్రి అచ్చెన్నాయుడు

పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - ఆచంట

మండలలోని కోడేరు వద్ద వశిష్ట గోదావరి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతోంది. దీంతో ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు వరద నీరు విడుదల చేస్తుండటంతో వశిష్టగోదావరికి వరద తాకిడి మొదలైంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం లంక భూముల్లో తమలపాకు, పచ్చిమిర్చి అరటి, కొబ్బరి, ఆకుకూరలు విస్తారంగా ఉన్నాయి. పంట చేతికొచ్చే తరుణంలో వరద ముంచెత్తుతుందేమోనని ఆందోళన రైతుల్లో నెలకొంది. కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, అయోధ్యలంక, పుచ్చలంక, మర్రిమూల, రాయిలంక, పెదమల్లంలంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.



కోడేరు వద్ద గోదావరి ఉధృతి

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గ ప్రజానీకం ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పిహెచ్‌సిల ద్వారా వైద్య సేవలు మరింత విస్తృతం చేసేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పాలకోడేరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతుసేవా కేంద్రం, వెల్‌నెస్ హెల్త్ సెంటర్‌ను ఆయన కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి శనివారం ప్రారంభించారు. కొండేపూడిలో నిర్మించిన రైతుసేవా కేంద్రం, వేంద్రలో సీసీ రోడ్డును రఘురామకృష్ణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ కునాధరాజు మురళీకృష్ణరాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), మాజీ ఎంపిపి పాలా వెంకట చలపతి, టిడిపి మండలాధ్యక్షులు కొత్తపల్లి సూర్యనారాయణరాజు (బాబు), సర్పంచులు ఇంజేటి మరియమ్మ, చింతపల్లి చిన్న వెంకటనారాయణ (చిన్న), కడలి నాగేశ్వరి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం భవనాలకు దారి ఉందో, లేదో చూడకుండానే నిర్మాణాలు చేపట్టిందని, ఆ సమస్యలన్నీ పరిష్కరించి భవనాలను అభివృద్ధి చేసి ప్రారంభించామని చెప్పారు. హెల్త్ ప్రైమరీ సెంటర్ల భవనాలు నిర్మించి వైద్యసేవలు విస్తృతం చేసి ప్రజానీకానికి సంపూర్ణ ఆరోగ్యం అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా పి4 తీసుకొచ్చారని, మార్గదర్శకులు ఒక కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నారని, తాను మాత్రం ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని మంచి పనులు చేసేలా కృషి చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని దాతల సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు జుత్తిగ నాగరాజు, కొత్తపల్లి నాగరాజు, కామన రాంబాబు, గాదిరాజు శ్రీనివాసరాజు, కమ్మిలి రాంబాబు, భూపతిరాజు వంశీకృష్ణరాజు, నడిపూడి అప్పారావు, గాదిరాజు శ్రీనివాసరాజు, బాలాజీ, మందపాటి రామరాజు, వైఎస్ఎన్.మూర్తి, గాదిరాజు సూర్యనారాయణరాజు, తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపిడిఒ వి.రెడ్డియ్య, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, హౌసింగ్ ఎఇ నరసింహారావు, పంచాయతీరాజ్ అధికారి విజయకుమార్‌రాజు, పిహెచ్‌సి వైద్యాధికారి గులాబ్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు బంగారు గోపీ, కృష్ణమోహన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

వేంద్రలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

రోడ్డు ప్రమాదంలో డిఎస్‌పి మేకా చక్రధర్‌రావు దుర్మరణం

స్వస్థలం పాలకొల్లులో విషాదఛాయలు

ప్రజాశక్తి - పాలకొల్లు

తెలంగాణలోని చౌటుప్పల్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన ఇంటెలిజెన్స్ డిఎస్‌పి మేకా చక్రధరరావు మృతి చెందడంతో పట్టణ పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. చక్రధరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాలుగు నెలల క్రితమే పాలకొల్లులో పెద్దకుమార్తె ఫంక్షన్ సైతం నిర్వహించారు. చక్రధరరావుకు ముగ్గురు సోదరులు ఉన్నారు. వారందరిలో ఈయనే చిన్నవాడు. దిగువ మధ్యతరగతి కుటుంబం కావడంతో కష్టపడి పాలకొల్లులో డిగ్రీ పూర్తి చేశారు. అల్లు వెంకట సత్యనారాయణ ఎంఎల్ఎగా ఉండగా మున్సిపల్ కౌన్సిలర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత పోలీస్ కావాలనే లక్ష్యంతో ప్రిపేరై 1995లో రిజర్వ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. నాటి నుంచి కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. భార్య ప్రయివేటు ఉద్యోగిని. పెద్ద కుమార్తె ఎనిమిదో తరగతి, చిన్న కుమార్తె రెండో తరగతి చదువుతున్నారు. సోదరులు పాలకొల్లులోనే స్థిరపడ్డారు. అతి తక్కువగా మాట్లాడే స్వభావం ఉన్న చక్రధరరావు మృతితో పట్టణంలో ఎక్కడ చూసినా అదే చర్చ సాగింది. చక్రధరావు భౌతికకాయాన్ని శనివారం సాయంత్రం పాలకొల్లు తీసుకొచ్చారు.

సమస్యలతో ఉపాధ్యాయులు సతమతం

బోధనేతర పనులు పెంచి బోధనకు దూరం చేయడం సిగ్గుచేటు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉపాధ్యాయులకు బోధన కంటే బోధనేతర పనులు కేటాయిస్తూ అనేక సమస్యల్లోకి నెట్టేస్తున్నారని, తక్షణం ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని, రెండు నెలలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య వెంటనే పరిష్కరించి జీతాలు చెల్లించాలని కోరుతూ శనివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం, శిక్షణా తరగతుల పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశాయన్నారు. ప్రతిరోజూ ఏదోక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్‌లలో అప్లోడ్ చేయమనడం, విద్యాకిట్లు పంపిణీ అప్లోడ్ చేయాలంటూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధ్యాయులకు ఏ మాత్రం సంబంధం లేని పి4 వంటి విషయాలు కూడా ఉపాధ్యాయులపై మోపుతుండటం సిగ్గుచేటన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్లో అనేక సమాచారాలు పెట్టాలనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. బదిలీలు జరిగి నెల రోజులు గడిచినా ఇప్పటికీ వేలాదిమంది ఉపాధ్యాయులు రిలీవింగ్‌కు నోచుకోలేదన్నారు. వేలాది పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూళ్లగానే పని చేస్తున్నాయన్నారు. పేరుకు ఐదుగురు ఉపాధ్యాయులును ఇచ్చినా అనేక పాఠశాలల్లో ఇద్దరే పని చేస్తున్నారని తెలిపారు. మరోవైపు ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా అంక్షలు విధిస్తున్నారన్నారు. ఆప్షనల్ సెలవులు, లోకల్ సెలవులు వినియోగించుకోవడంపై ఉన్నతాధికారుల ఆంక్షలు ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి కల్గిస్తున్నాయన్నారు. అనంతరం డిఇఒ కార్యాలయ ఎడి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు రాజశేఖర్, రామకృష్ణంరాజు, రామకృష్ణ ప్రసాద్, కృష్ణకుమారి, బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి ఖర్చుల సొమ్ము జమ

164 మందికి రూ.25 వేలు చొప్పున విడుదల

జిల్లా ఖజానాధికారి గణేష్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పెన్షనర్లు మృతి చెందితే అందించాల్సిన మట్టి ఖర్చుల సొమ్ము ఎట్టకేలకు విడుదల చేశారు. నాలుగు నెలల కాలంలో మృతి చెందిన 164 మంది పెన్షనర్ల కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. జిల్లాలో నాలుగు నెలల నుంచి ఎంతోమంది ప్రభుత్వ పెన్షనర్లు మృతి చెందారు. అయితే ప్రభుత్వం నుంచి అందించాల్సిన రూ.25 వేలు మట్టి ఖర్చులు ఏఒక్కరికీ ఇవ్వలేదు. దీంతో పెన్షనర్ల కుటుంబ సభ్యులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'మట్టి ఖర్చుల మాటేమిటి' శీర్షికన ఈ నెల 25న ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై జిల్లా ఖజానాధికారి ఆడారి గణేష్ స్పందించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెండింగ్‌లో ఉన్న మట్టి ఖర్చుల సొమ్ము మొత్తాన్ని మృతి చెందిన పెన్షనర్ల కుటుంబ సభ్యుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

సిపిఎం ఆధ్వర్యాన ఇంటింటా కరపత్రాల పంపిణీ

తాడేపల్లిగూడెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలకు షాక్ కొట్టే అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పట్టణ ప్రజలకు సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యాన ఆరవ రోజు అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ హౌసింగ్ బోర్డు, మెయిన్ రోడ్డు ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం అయిదు సంవత్సరాలలో తొమ్మిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్లు ప్రజలపై భారాలు వేస్తే ప్రతి పక్షంలో ఉన్న టిడిపి ప్రభుత్వం బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి మేము అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికి తీరా అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.15,485 కోట్లు ప్రజలపై భారాలు మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. 2000 సంవత్సరంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు అమలు చేయాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించిందని ఆయన తెలిపారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమానికి సిపిఎం శ్రేణులు, కార్యకర్తలు హాజరైతే కాల్పులు జరిపి ముగ్గురు ప్రాణాలు పొట్టనపెట్టుకున్నారని వాపోయారు. ఆ ఉద్యమం ఫలితంగా టిడిపి 10 సంవత్సరాలు అధికారం కోల్పోయిందని ఎద్దేవా చేశారు. గతం మరిచిన చంద్రబాబు మరలా అదానీ స్మార్ట్ మీటర్లు బిగింపు ద్వారా రాష్ట్ర ప్రజానీకంపై రూ.50 కోట్లు భారాలు మోపాలని చూస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపకపోతే దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను ఐక్యంచేసి తమ ప్రభుత్వాలను బంగాళాఖాతంలో కలుపుతామని హెచ్చరించారు. శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, దత్తు రాము, బర్ల బాలాజీ, కన్నంరెడ్డి శివాజీ, బొడ్డపాటి శివ, జి.దుర్గాప్రసాద్, జి.పసలపూడి, రాము, యడ్ల శ్రీను, కొమ్మిరెడ్డి ఉదయ్ కుమార్, విశంశెట్టి అప్పారావు, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చెప్పిందల్లా చేసిన గత వైసిపి ప్రభుత్వం తీరుగా కూటమి ప్రభుత్వం చేయడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు.

పెనుమంట్రలో..

శనివారం మండలంలోని పెనుమంట్ర, గరువు, పొలమూరు, మాముడూరు తదితర గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు బిగించడం పట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి పంపుసెట్లుకు మీటర్లు బిగించి నందుకు రైతులు పెద్ద ఎత్తున ఆనాడు ప్రభుత్వాన్ని వ్యతిరేకించగా.. అప్పటి ప్రతిపక్ష టిడిపి యువ నాయకుడు లోకేష్ పంపుసెట్లు బద్దలు కొట్టమని చెప్పారని గుర్తుచేశారు. ఈనాడు జగన్ దారిలోనే నడవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆదాని సేవలో ఆదానీ మీటర్లు మన ఇళ్లకు బిగించడాన్ని వ్యతిరేకించాలని ఆకుల హరే రామ్ పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి కె.ప్రసాద్, సిపిఎం నాయకులు బి.విజయకుమార్, వివిధ ప్రాంతాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సిపిఎం సభ్యులు తూటే సురేష్, పిల్లి శ్రీనివాస్, చింతపల్లి అప్పారావు, భాస్కరరావు, గంటి ఆంజనేయులు పాల్గొని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

బకాయిల పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేత సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు నిలుపుదల చేయడం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కన పెడుతుందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని కొత్త కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వడానికి కొన్ని కళాశాలలు నిరాకరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు తమ విద్యను ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. లేనిపక్షంలో విద్యార్థులు విద్యా సంవత్సరాన్నే కోల్పోయే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అంతేగాని విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడే లక్షలాదిమంది పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

2న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ఏలూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు రెండో తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భీమవరంలో 20న ఐద్వా జిల్లా మహాసభ

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

భీమవరం : అఖిల భారత ప్రజాతంత్ర మ

సమస్యలు అపరిష్కృతం.. ప్రభుత్వ లక్ష్యాలు ఘనం..!

రెండు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీనికి ముందు ఎండ తీవ్రతకు విలవిల్లాడిన జనం వర్షాలతో సేదతీరారు. రైతులు సైతం సాగునీటి కష్టాలు గట్టెక్కుతాయని సంతోషించారు. అయితే అనావృష్టి పోయి అతివృష్టి అన్నట్లు వర్షాల వల్ల డ్రెయిన్లు పొంగి పొలాలను ముంచెత్తాయి. మొన్నటి వరకూ సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు ఇప్పుడు పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు పరుగులు తీయాల్సిన విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇక రోడ్లన్నీ వర్షాలకు చిత్తడిచిత్తడిగా మారాయి. కొన్నిచోట్ల అయితే రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేని పరిస్థితి సైతం ఉంది. వీటిపై దృష్టి సారించాల్సిన ప్రజాప్రతినిధులేమో 'సుపరిపాలనలో తొలి అడుగు' అంటూ ప్రచారంలో మునిగి తేలుతుండగా, అధికారులేమో పి-4 మార్గదర్శకుల కోసం గాలింపులో ఉన్నారు.

గుంతలు లేని రహదారులే ప్రభుత్వ లక్ష్యం అంటూ అధికారంలోకొచ్చాక కూటమి ప్రభుత్వం హడావుడి చేసింది. గత వైసిపి ప్రభుత్వంతో పోల్చుకుంటే రోడ్లపై గుంతలు పూడ్చే ప్రయత్నం చేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ ప్రక్రియ కేవలం 60 శాతం మాత్రమే పూర్తవ్వగా, మిగిలిన 40 శాతం గుంతల సమస్య అలానే ఉంది. అయితే తూతూమంత్రంగా గోతులు పూడ్చటం, రోడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పరిమితికి మించి లోడులతో వాహనాల రాకపోకలతో రోడ్లు అతి తక్కువ కాలంలోనే దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో వాటికి మరమ్మతులు చేయించకపోవడం, తాజాగా వర్షాలు విస్తారంగా కురవడంతో రోడ్లన్నీ చిధ్రమయ్యాయి. పట్టణాల్లో సైతం రోడ్లు పెద్దపెద్ద గుంతలతో నిండి ఉండి జనం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రమైన ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం పట్టణాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోని దుస్థితి. అదే సమయంలో ప్రధాన రహదారులు సైతం దెబ్బతిన్నా కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదనడానికి ఏలూరు-జంగారెడ్డిగూడెం రహదారే నిదర్శనం. అదే సమయంలో ఈ మార్గంలో ఆడమిల్లి వద్ద కల్వర్టు దెబ్బతినడంతో వాహనాలన్నీ ద్వారకాతిరుమల మీదుగా చుట్టుతిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఫలితంగా గంటన్నరలో పూర్తి కావాల్సిన ప్రయాణం మరో గంట అదనంగా పడుతుండటంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. దీనిపై ఇప్పటికీ యుద్ధప్రాతిపదికన ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల ఉదాశీన వైఖరిని ప్రతిబింబిస్తోందని చెప్పొచ్చు.

ఇక వర్షాల వల్ల రెండు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. అయితే డ్రెయిన్లలో గుర్రపుడెక్క, పూడిక తీత వంటి పనులు చేపట్టిన చోట వెంటనే ముంపు నీరు తొలగగా కొన్నిచోట్ల మాత్రం ఎక్కువ రోజులే నీరు నిలిచిపోయింది. దీంతో రైతులు నారు, నాట్లు కుళ్లిపోతాయని లబోదిబోమన్నారు. అధికారులేమో అదేమీ లేదని చెప్పడం మినహా అదెలాగో చెప్పకపోవడం గమనార్హం. కొన్నిచోట్ల రైతులే డ్రెయిన్లలో అడ్డంకులు తొలగించి నీరు కిందకు పారేటట్లు చేసుకోవాల్సి వచ్చింది. దీనిపైనా ఏఒక్క ప్రజాప్రతినిధీ స్పందించిన దాఖలాల్లేవు.

ఈ క్రమంలో సుపరిపాలనలో తొలి అడుగు పేరిట మంత్రులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రచారం సాగిస్తున్నారు. మంత్రులు సైతం పెద్దవత్తున రెండు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అయితే చింతలపూడి నియోజకవర్గంలో రోడ్లు, గణపవరం, ఆచంటల్లో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలపై అక్కడి జనం మంత్రుల దృష్టికి తీసుకురావడం విశేషం. అంటే హామీలన్నీ అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా.. సమస్యలు మాత్రం అలానే తిష్ట వేశాయని జనం గోడు చెప్పకనే చెబుతోంది. ఇక అధికారులేమో విజన్ యాక్షన్ ప్లాన్, పి-4 అంటూ సమావేశాలు, సర్వేలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రభుత్వ లక్ష్యాలను ఎవరూ తప్పుబట్టడం లేదు. అయితే స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు పరిష్కరించకుండా పేదరిక నిర్మూలన, సమగ్రాభివృద్ధి ఎలా సాధ్యమో ప్రజాప్రతినిధులు, అధికారులే చెప్పాలి. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

- వి.ఎస్.ఎస్.వి.ప్రసాద్

చించినాడ వంతెనకు మరమ్మతులు

వాహన రాకపోకలపై ఆంక్షలు..

యలమంచిలి : మండలంలోని చించినాడ గోదావరి నదిపై నిర్మించిన వంతెనకు మధ్యలో గోతులు ఏర్పడి రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ నేపథ్యంలో రోడ్డు మరమ్మతులు కారణంగా వాహన రాకపోకలపై సంబంధిత అధికారులు తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. హైడ్రాలిక్ సిస్టం ద్వారా నిర్మితమైన ఈ వంతెనకు కింది భాగంలో స్టీల్ ప్లేట్లు స్ప్రింగ్ లాంటివి ఏర్పాటు చేసేందుకు మరమ్మతులు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ పనులన్నీ పూర్తి అయ్యేసరికి సుమారు రెండు, మూడు నెలలు పట్టే అవకాశం ఉంది. చిన్న కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే రాకపోకలకు అవకాశం ఉంది. ఇక పెద్ద వాహనాలు లారీలు, ఆర్‌టిసి బస్సులు, స్కూల్ కాలేజీ బస్సులు 8 అడుగులు దాటి ఎత్తుగా ఉండే ఇతరత్ర ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలు తిరిగేందుకు అవకాశం లేకుండా సంబంధిత అధికారులు బారికేట్లు ఏర్పాటు చేశారు. వంతెన పై తాత్కాలికంగా రాకపోకలు నిలుపుదల చేయడంతో కేవలం 30 కిలోమీటర్ల వేగంతో వెళ్లే తేలికపాటి వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెప్పారు. మరమ్మతులు కారణంగా ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లేందుకు అధికారులు ఆజ్ఞలు జారీ చేశారు.

అప్పారావు శర్మ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న చాగంటి

నరసాపురం పట్టణానికి చెందిన లంక అప్పారావు శర్మ పాలకొల్లులో ప్రమాదానికి గురై ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను శనివారం డిసిఎంఎస్ ఛైర్మన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి పార్టీ తరుపున సహాయం అందేలా చూస్తానని చెప్పారు. డిసిఎంఎస్ ఛైర్మన్ గౌరవ వేతనంను చాగంటి ఉమానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతినెల పేద కుటుంబానికి అందజేస్తానని, అందులో భాగంగా రూ.10 వేలను లంక వెంకట్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ప్రభుత్వంపై విమర్శలను ప్రజలే తిప్పికొట్టాలి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం : ప్రభుత్వంపై విమర్శలను ప్రజలే తిప్పికొట్టాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. మండలంలోని పుల్లాయిగూడెంలో శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ అమలుతో పాటు అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు గ్రామంలో భూములు ఆన్‌లైన్ కావడంలేదని, గత ప్రభుత్వం ఇచ్చిన కాలనీలో కనీస వసతులు లేవని, గ్రామంలో రోడ్లు నిర్మించాలని, గ్రామానికి ఆర్‌టిసి బస్సు రావడం లేదని తదితర సమస్యలను ఎంఎల్ఎకు నివేదించారు. అనంతరం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన చెరువుకు రేవుతో పాటు స్నానాలు చేసేందుకు షవర్, ప్రజలకు వాటర్ ట్యాంకు నీళ్ల అందించే బోరులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ అధ్యక్షత వహించగా జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, సర్పంచి చీకట్ల పుష్ప లక్ష్మీకుమారి మల్లేశ్వరరావు, ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, కొండపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివాస్

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో విజయ్ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భవానీ ప్రసాద్ రాయపూడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 19 ఏళ్ల కిందట సరిగ్గా జులై 26న కార్గిల్‌లో భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడిందని, ఉగ్రవాదుల ముసుగులో పాక్ పాల్పడిన అరాచక క్రీడను తిప్పికొట్టింది భారత సైన్యం అన్నారు. కశ్మీర్‌లో పాగా వేయాలనుకున్న పాక్ కుటిల ప్రయత్నానికి మన భారత జవాన్లు చెక్ పెట్టారని, పాకిస్తాన్‌పై భారత్ సాధించిన గొప్ప చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకుంటూ.. నాడు భరతమాత కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లను తలుచుకుంటూ ప్రతి ఏటా కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఆర్మీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మధు, నందిని, లీలా కుమారి పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని బోధనలు అవసరం : ఎంఎల్ఎ

భీమవరం టౌన్: వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుని బోధనల అవసరం ఉందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరంలో ఈనెల 29న జరిగే బుద్ధినితో నా ప్రయాణం తెలుగు నాటకం బ్రోచర్‌ను శనివారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఎ అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నాటకాన్ని ప్రదర్శించడం గొప్ప విశేషమని, ఇప్పటికే 16 జిల్లాల్లో బుద్ధినితో నా ప్రయాణం తెలుగు నాటకం ప్రదర్శించడం జరిగిందన్నారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కోనా జోసెఫ్ మాట్లాడుతూ సమాజానికి గౌతమ బుద్ధుడు జీవిత చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ నాటకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, జనరల్ సెక్రటరీ కొల్లి శ్రీనివాస్, ఎం.శ్రీకర్, కమలాకర్, గాతల సందీప్ పాల్గొన్నారు.

సత్యవరం సొసైటీ అభివృద్ధికి కృషి

ఛైర్మన్ మైగాపుల నాగ వెంకట శ్రీరాములు


ప్రమాణం చేసిన త్రి కమిటీ సభ్యులు

పెనుమంట్ర : సత్యవరం సొసైటీ అభివృద్ధికి గతంలో ఈ పదవి నిర్వహించిన అనుభవంతో సహ సభ్యులతో కలిసి కృషిచేస్తానని నూతన ఛైర్మన్ మైగాపుల నాగ వెంకట (శ్రీరాములు (రాము) అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పిఎసిఎస్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్‌గా రాము, సభ్యులుగా దిగుమర్తి వేణు, కట్టా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయులు పితాని వెంకట్, టిడిపి మండల కమిటీ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, కూటమి నాయకులు, సొసైటీ రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

జుత్తిగ సొసైటీ అభివృద్ధికి కృషి

ఛైర్మన్ వీరవల్లి రాంబాబు


త్రి సభ్యులను అభినందిస్తున్న గ్రామస్తులు

పెనుమంట్ర : జుత్తిగ సొసైటీ పరిధిలోని రైతులకు విలువైన సేవలు అందించి ప్రగతి పథంలో నిలుపుతానని పిఎసిఎస్ ఛైర్మన్ వీరవల్లి రాంబాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక సొసైటీ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు సభ్యులు గుత్తుల శ్రీను, పోతంశెట్టి వెంకటరెడ్డి ప్రమాణం చేశారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయులు పితాని వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు నియోజకవర్గం అభివృద్ధి మంత్రి రామానాయుడు వల్లే సాధ్యమని టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కోడి విజయ భాస్కరరావు అన్నారు. పూలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర రావు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా వేధిస్తున్న విద్యుత్ సమస్య శాశ్వతంగా తీరేలా 100 ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు మంత్రి రామానాయుడు కృషి ప్రశంసనీయమన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలోనూ, నేటి కూటమి ప్రభుత్వంలోను రామానాయుడు చేసిన అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో ఎటువంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడి రామకృష్ణ, ఎఇ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

ఆకివీడు : స్థానిక బుధవారం మార్కెట్ కల్యాణ రామాలయంలో ఈనెల 12వ తేదీన లయన్స్ క్లబ్ ఆఫ్ అభయ ఆధ్వర్యాన నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో కళ్లజోళ్లకు ఎంపిక చేసిన వారికి శనివారం కళ్లజోళ్ల అందజేశారు. పల్లి అప్పిరెడ్డి, సాయన సూపర్ణ, జూంగా మధు బాబు ఆర్థిక సహకారంతో 91 మందికి ఉచితంగా అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు జి.వీరకుమార్ చెప్పారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల: 83339 88814

భూ సమస్యలు పరిష్కరిస్తా..

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీ పట్టణ రెవెన్యూ పరిధిలో అన్న భూ సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని కాళీపట్నం పడమరలో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, విప్ బొమ్మిడి నాయకర్, ఎఐఐసి ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాల అందించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌లు నిత్యం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. మెగా డిఎస్‌సి, అన్నా క్యాంటీన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పించేందుకు 10 లక్షల కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు రానున్నాయన్నారు. గత ప్రభుత్వం మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చిన పరిశ్రమలను కూడా వెనక్కి పంపిందని విమర్శించారు. అనంతరం కాళీపట్నం భూముల హక్కులు కల్పించి రిజిస్ట్రేషన్ అనుమతి ఇవ్వాలని కోరుతూ రైతులు వినతి పత్రాలు అందించారు. ముత్యాలపల్లిలోని 500 ఎకరాలకు సంబంధించి సింగోడియన్ దొర పట్టా భూములకు రిజిస్ట్రేషన్ కల్పించాలని కోరుతూ గ్రామస్తుల వినతి పత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న), మాజీ ఎంఎల్సీ అంగర రామ్మోహనరావు, మత్స్య కార్పొరేషన్ ఛైర్మన్ కొళ్ల పెద్దిరాజు, ఎపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు కత్తిమడ ముత్యాలరావు, రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు సిరిగినీడి రాజలక్ష్మి, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, మాజీ ఎంపిపి సత్తినేని మోహన్ రావు, కొల్లాటి గోపి ఉన్నారు.

నరసాపురం : కాళీపట్నం భూ సమస్యలపై అధ్యయనం చేసి త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కాళీపట్నం జమీందారీ భూముల శాశ్వత హక్కు పట్టాలు, 22ఎ భూ సమస్యలు, అన్ సెటిల్డ్ ఎస్టేట్ భూ సమస్యలకు సంబంధించి జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న జమీందారీ భూములకు సంబంధించి హక్కుల సమస్యలు అధ్యయనం చేసి త్వరలో పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా భూమికి సంబంధించి హక్కు పత్రాలు ఉన్న కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏవిధమైన పత్రాలు లేని హక్కుదారులకు కూడా పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రైతులు లేవనెత్తిన పలు భూ సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి రైతులకు భరోసా ఇచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కాళీపట్నం జమీందారీ భూములకు సంబంధించి హక్కుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల సూచనలు, సలహాలను తీసుకోవడం జరిగిందని మంత్రికి వివరించారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఆర్‌డిఒ దాసిరాజు, మాజీ ఎంఎల్సీ అంగర రామ్మోహన్, పొత్తూరి రామరాజు, మొగల్తూరు తహశీల్దార్ రాజకిషోర్, రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి
ఉద్యోగాల కల్పనకు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు
రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్

పెనుగొండ: మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ శనివారం మండలంలోని వడలి గ్రామంలో రూ.198.42 కోట్ల వ్యయంతో ప్రారంభంకానున్న జలజీవన్ మిషన్ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జల జీవన్ మిషన్ ద్వారా వడలి గ్రామం నుంచి చుట్టుపక్కల 14 గ్రామాలకు గోదావరి స్వచ్ఛ జలాలు సరఫరా చేయనున్నామన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, మండల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయింది

ప.గో.జిల్లా, పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామానికి చెందిన మామిడిశెట్టి భారతి, భర్త : సోమరాజు అను నేను నాయొక్క పాస్ పోర్ట్ పడిపోయింది. ఇంటి దగ్గర నుండి సిద్ధాంతం సెంటర్ కు వెళుతుండగా నా యొక్క EC పాస్‌పోర్ట్ పడిపోయింది. పాస్‌పోర్ట్ నెం : X0937831 గల EC పాస్‌పోర్ట్ ఏవరికైన దొరకిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తేలియజేయగలరు.

మామిడిశెట్టి భారతి, భర్త : సోమరాజు
హౌస్ నెం : 6 - 72
సిద్ధాంతం, పెనుగొండ మండలం
ప.గో.జిల్లా. సెల్ : 9618427669

మహారాజశ్రీ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో
ఎ.ఆర్.బి.ఇ.పి.169/2025
లో
ఎ.సి.పి.758/2021

బిట్వీన్ :
M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
Rep by its Authorized Signatory
...డిహెచ్ఆర్/క్లయింట్
&
వేమారెడ్డి సత్యనారాయణ & 2 ఇతరులు
...జె.డి.ఆర్./రెస్పాండెంట్స్
పై నంబరు గ్రంథంలో రెస్పాండెంట్ నెం. 1 వేమారెడ్డి సత్యనారాయణ, S/o.సోమేశ్వరరావు, డోర్‌నెం. 2-72, సంత మార్కెట్, ద్వారకాతిరుమల, ప.గో.జిల్లా. అనువారికి నోటీసులు అమలు కొరకు పైకోర్టు వారి ఎదుట **ది.01-8-2025 తేది ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సి.హెచ్.సౌందర్య
అడ్వకేట్, ఏలూరు.

In the court of Hon'ble VII Aditional District cum (family) court Judge : W.G.Dt., Eluru
A.S.No.68/2024

Between:
Medapati Surya Prabhavathi And 2 Others
...Peititioners/Appelants
And
Golla Yalamandhala Rao & 3 Others
...Respondents
To.
R2: Lanka Srinivasa Rao, S/o.Pullaiah, Business, R/o.Western Street, Eluru.
R3: Lanka Rajeswari, W/o.Srinivasa Rao, Business, R/o.Western Street, Eluru.
R4: Kanumilli Sasi Sekhara Rao, S/o.Satyanarayana, Business, R/o.Near New Bus Stand, Eluru.
పై నంబరు A.S.No.68/2024లో 2 to 4 రెస్పాండెంట్లు కోర్టు వారు పంపిన నోటీసులు అమలు జరగని కారణముగా A.S.68/2024 ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు అమలుకు కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినారు. వాయిదా **ది.12-8-2025 ఉదయం 10.30 గం॥లకు** పైకోర్టు వారి వద్ద పై వివరించిన 2 to 4 రెస్పాండెంట్లు స్వయంగా గాని మీ ప్లీడరు గారు ద్వారా గాని హాజరు కాగలరు లేని యెడల మీ పరోక్షంగా విచారించబడును.
బి.గౌరిశంకర్, ఎ.శోభారాణి,
ఏలూరు ఎ.వి.ఎస్.సూర్యారావు,
ది.27-7-2025 అడ్వకేట్స్, ఏలూరు.

ఆలమూరును ఉత్తమ సొసైటీగా తీర్చిదిద్దుతా

ఛైర్మన్ కోయ నాగ వెంకట పోతురాజు



ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోనే కాక జిల్లాలోనే ఉత్తమ సొసైటీగా ఆలమూరు పిఎసిఎస్‌ని తీర్చిదిద్దుతానని నూతన సొసైటీ ఛైర్మన్ కోయ నాగ వెంకట పోతురాజు అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆలమూరు సొసైటీ వేదికగా సొసైటీ త్రి సభ్యుల కమిటీ ప్రమాణ స్వీకారంలో భాగంగా ఆయనతో పాటు సభ్యులు కడలి ఏడుకొండలు, పెనుమత్స రాఘవ రాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎంఎల్ఎ తనయులు పితాని వెంకట్, టిడిపి మండల కమిటీ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్, మండల, స్థానిక కూటమి నాయకులు, సొసైటీ రైతు సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీని ప్రగతి బాట నడిపిస్తా

ఛైర్మన్ జవ్వాది సురేష్


ప్రమాణ స్వీకారం చేసిన త్రిసభ్యులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర సొసైటీ కొందరి స్వార్థం వల్ల గతంలో పొందిన చెడ్డ పేరు తొలగి పోయేలా చేసి ప్రగతి పట్టాల మీద నిలుపుతానని పిఎసిఎస్ నూతన ఛైర్మన్ జవ్వాది సురేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక సొసైటీ వేదిక వద్ద జరిగిన సొసైటీ త్రి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయనతో పాటు సత్తి సత్యానంద రెడ్డి, పొన్నమండ విజయ నరేష్ కుమార్‌లు ప్రమాణం చేశారు. జనసేన నుంచి తనకు ఈ అవకాశం ఇచ్చిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని తనయులు పితాని వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, పార్టీ క్లస్టర్ కన్వీనర్ చింతపల్లి రామకృష్ణ, జనసేన మండల కమిటీ అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్, స్థానిక నాయకులు గంటా వాసు, గోపరాజు మారుతీ కృష్ణ, కూటమి నాయకులు, సొసైటీ రైతు సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - యలమంచిలి


హరికిషోర్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

మండలంలోని యలమంచిలి, కొంతేరు గ్రామాలకు సంబంధించిన సొసైటీ నూతన ఛైర్మన్‌లుగా ఆ పార్టీకి చెందిన సీనియర్ టిడిపి నేతలు బొప్పన హరికిషోర్, బత్తుల రాజులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు యలమంచిలి సొసైటీ మెంబర్స్‌గా కాసా సత్య నరసింహ సాయి, దొంగ శ్రీనివాస్, కొంతేరు గ్రామ సొసైటీ మెంబర్స్‌గ